కథానిక

# పిశాచాల ముచ్చట్లు

"సద్భవ"

హోరు హోరుమని వీచిన గాలి సహాయంతో భోరు భోరుమని వర్షం కురిసి కురిసి వెలిసిన తరువాత, జలభరితమైన మేఘాలన్నీ తమ తిరుగుబాటును ఉపసంహరించుకొని వెనుకకు మరలిపోయిన తరువాత, శూన్యంగా తెల్ల తెల్లగా నిర్మలంగా ఉన్న ఆకాశంలోకి జరిగిపోయిన కల్లోలాన్నంతటినీ పర్యవేక్షించే నిమిత్తమైనట్లు (పోట్లాటలు కొట్లాటలు అయిపోయి ప్రశాంత వాతావరణం నిండిన స్థలంలోకి పోలీసులు దర్యాప్తు కోసరం వచ్చినట్లు) ఒక దిక్కునించి ఒక దిక్కుకు ప్రశాంతంగా ప్రయాణం చేస్తున్న మనోహరమైన పరిపూర్ణమైన పౌర్ణమిచంద్రుని మాదిరి; అంతవరకు కల్లోలంతోటి కలహాలతోటి నిండి ఇంతకుమునుపే వదలిపెట్టబడిన హాలులోకి, అంత గంద్రగోళం తరువాత ఆ హాలు ఎలా ఉందో చూడాలని వచ్చినట్లు నిదానంగా అడుగులు లెక్కపెట్టుకొంటున్నట్లు వచ్చింది వనజ.

ఇంతకు పూర్వం ఈ హాలులోనే తన తండ్రి తన అన్న, తన మామ, తన భర్త ఏవేవో మనస్పర్థల్ని వెడలగ్రక్కుకొని ఎవరి మట్టుకు వారు బిరుసుగా, విసురుగా, విసుక్కుంటూ, కసురుకుంటూ హాలు వదలివేసి బయటకు పోయారు.

వాగ్వివాద రూపేణా వచ్చిన ఈ కలహం ఏరీతిని ఎలా అంతం కానున్నదో కొంత తెలియక కొంత ఊహించుకొని వనజ కుపితురాలవసాగింది. తనను గురించి, తన పుట్టింటివారు తన భర్తకు ఇవ్వవలసిన కట్నం గురించి ఇంత కలహం రావటం, పర్యవసానంగా వారు ఒకరికొకరు మరింత దూరం కావటం తలచుకొని ఆమె తన భవిష్యత్తును అంచనా వేసికోవటం మొదలు పెట్టింది. ఏ విధంగా జరుగుతుందోనని ఆమె సున్నిత హృదయం మామూలుకంటె ఎన్నోరెట్లు ఎక్కువగా కొట్టుకోవటం మొదలు పెట్టింది.

వారు పోట్లాటల ఉద్రేకంలో వళ్లు తెలియకుండా పీల్చిపారేసిపోయిన చుట్ట, బీడీ, సిగరెట్ ముక్కల్ని సమయాసమయాలను గుర్తించకుండా ఆ అర్థరాత్రి మూలనున్న చీపురు తీసి ఊడ్చివేసింది. నెమ్మదిగా సింహద్వారపు తలుపులు చప్పుడు కాకుండా తీసి పోగు పారవేసి రావటానికి బయటకు వెళ్ళింది. పోగు పారవేసింది. ఏమీ తోచక వచ్చి ముందరి అరుగు మెట్లపై కూర్చుని మోకాళ్ళపై నున్న అరచేతుల్లో గడ్డాన్ని ఆనించి చిన్నకండ్లను పైకెత్తి నిర్మలమైన ఆకాశం వంక మనోహరంగా, చల్లగా, వయ్యారంగా ప్రయాణం చేస్తున్న చంద్రుని వంక చూస్తూ జరిగిపోయిన విషయాలను భవిష్యత్తును ఆలోచించేందుకోసమై నెమ్మదిగా, వరుసగా నెమరు వేసుకుంటూంది. వెనుక గదులలో తన తండ్రి, అన్న, అమ్మ గురకపెడ్తూ కొండ రాళ్లు దొర్లిస్తున్న శబ్దంతో నిద్రిస్తున్నారు.

ఆసలు జరిగిందేమిటంటే, వనజకు శాస్త్రోక్తంగా వివాహం జరిగి సంవత్సరం కావస్తూంది. వివాహంనాడు పరంధామయ్య అల్లుడికి కట్నం క్రింద రెండువేలరూపాయలు, రెండకరాల భూమి చదివించాడు. రొక్కం దగ్గర మాత్రం వీరికి పేచీ ఏమీ లేదు. ఎందుచేతనంటే అన్న కాలంలోనే పల్లెరంలో పోశాడు. పోతే ఇప్పుడొచ్చిన పేచీ అంతా మాగాణి భూమి రెండకరాలదగ్గరే. అదీ ఇవాళరాత్రి ఒక సంవత్సరం తరువాత తగాయిదా పొక్కింది.

పరంధామయ్యగారు ఈ రాత్రి అల్లుడు కమలాకరరావుని, వియ్యంకుడు జానకిరామయ్యగారిని విందుకు ఆహ్వానించాడు. వారు పరమసంతోషంతో స్వీకరించారు. పరంధామయ్య,

ఏదో కలిగినంతలో వారిని శక్తికొలది సంతృప్తి పరిచాడు. భోజనాలు అయిపోయిన తరువాత చుట్ట, బీడీ, సిగరెట్లు మొదలయినవి ఏవి కాల్చేవారు వాటిని కాల్చుతూ తీరుబాటుగా హాలులో కూర్చునివున్నారు. పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. ఈ విధంగా దాదాపు పదింటివరకు తమకు తెలియకుండానే జారి పోయింది. మాటల్లో పరంధామయ్య నోటి వెంట సకారణంగా ఒక వాక్యం వెలువడింది. చుట్ట నిప్పువంక పోతున్న పొగవంక, ఇంటి కప్పువంక చూస్తూ, కాలుమీద కాలు వేసుకొని మంచం పట్టెమీద కూర్చునివున్న వియ్యంకుడు జానకిరామయ్యతో పరంధామయ్య ఇంచుమించు చేతులు నలుపుకుంటూ అర్థిస్తున్న వాడి వలె "బావయ్యా, నీకు తెలియందేముంది. ఎలాగో మీ కివ్వవలసింది ఇవ్వవలసిందే కాని ఎలాగో దయవుంచి పల్లాన భూమి తీసుకోండి" అన్నాడు. వనజ పెండ్లినాటికి పరంధామయ్యగారు ఈనాడున్నంత దీనస్థితిలోను, చితికిన స్థితిలోను లేరు. అప్పట్లో వారికి ఆరెకరాల మాగాణి భూమి వుండేది. అంతా కాకపోయినా అందులో ఊరుపు తూర్పుగా వున్న నాల్గెకరాలు సుక్షేత్రమైన గడ్డ. ఈ గ్రామంలో చాలా పొలాలతో ఏమీ ప్రయాసలేకుండానే పోటీచేయగల తాహతు దానికుంది. కాని పరంధామయ్యగారికి అప్పట్లోనే సుమారు అయిదారువేల రూపాయల అప్పు ఉండేది. పెండ్లినాడు పళ్లెంలో పోసిన రెండువేల రొక్కం అప్పు తీసికొచ్చినదే నన్న సంగతి వియ్యంకుడు జానకిరామయ్యకు కూడా తెలుసును. ఇది యెవరికీ తెలియకుండా పరంధామయ్య దాచి వుంచిన విషయమేమీ కాదు. ఆలోచించిన వివిధ ఉపాయాలు అపజయమయిపోగా, పరంధామయ్య తప్పని సరిగా అప్పు తీర్చుకోవటంకోసం కన్నీళ్ళతో మూడెకరాల భూమిని తెగనమ్మివేయక తప్పింది కాదు. అందులోను మెరుగు భూమిలోనే అమ్మివేశాడు. ఇంక తూర్పున తనకున్నది ఒక్క యెకరమే. మిగిలిన రెండెకరాలు పల్లపుభూమి. ఇంకా కష్టపడే కొడుకున్నాడు. అతనికైనా ఏమీ మిగల్చకపోతే అతని బ్రతుకే దుర్భరమౌతుంది. కూతురుకైనా ఈయవలసిన కట్నం ఇయ్యకపోతే పేచీ వస్తుంది. అందుకని పరంధామయ్య ఏమని ఆలోచించాడంటే పల్లాన్నున్న నాసి రెండెకరాలు అల్లుడికిస్తే మిగిలిన ఒక్క మంచి ఎకరంతోటే యెలాగో కమతం చేసికొని బ్రతుకుతాడు అని ఆలోచించాడు. కాని వియ్యంకు డెక్కడ అసాధ్యుడు. ఆవులిస్తే ప్రేవులన్నీ వరుసగా లెక్కపెట్టగల మేధావి. పరంధామయ్య పూర్తిగా అనకముందే ఆమూలాగ్రంగా గ్రహించిన జానకిరామయ్య ఖణాఖణా కాలుతున్న చుట్టను వేళ్ళమధ్య పెట్టి, తక్కిన వ్రేళ్ళతో నెమ్మదిగా కోరమీసాన్ని పైకి మెలిపెడుతూ,

"నీ ఎత్తు నాకు తెలుసులేవోయ్, నాకెందుకు చెపుతావ్. అదేం కుదరదు. ఒక ఎకరం కొని అయినా సరే తూర్పు భూమే ఇయ్యి. లేకుంటే మానేయి. పోనీ పోయిందనుకుంటాం" అని అన్నాడు అంటూనే ఆఖరయిపోతున్న చుట్టను కోపంలో విసురుగా గోడకేసి కొట్టాడు. గోడకు బలంగా కొట్టుకున్న చుట్టనించి యెగిరిన రవ్వలు అదే మంచంమీద గోడకు ఆనుకుని అవతల పట్టెమీద కూర్చున్న కొడుకు కమలాకరరావు చేతిమీద పడినాయి. చురుక్కుమన్న శరీరాన్ని గీరుకొంటూ తల పైకెత్తి నవ్వుతున్నట్లు ఏడుస్తున్నట్లు కూడా కాకుండా మొఖం ఆదోకమాదిరిగా పెట్టి, "మీ ఎత్తులు నాకు మొదటే తెలుసు. అప్పని, సొప్పని వంకపెట్టి ఆస్థి అమ్మి సొమ్ము ఇంట్లో దాచుకొని, నాసిపొలం మాకు పూసి పొమ్మనే మీబుద్ధి నాకు ఆనికాలంనాడే తెలుసు" అని అంటూనే రుసరుసలాడుతూ ఆ మంచం మీదనుంచి లేచిదగ్గరేవున్న వేరే మంచం మీద పోయి చతికిలబడ్డాడు, అక్కడే వుంటే తండ్రిగారి ఆగ్రహానికి గురయిన చుట్ట నెరుసు మళ్లీపడవచ్చునని అనుమానించి. వాళ్లు పోట్లాటకి సిద్ధంగా వున్నా పరంధామయ్య మాత్రం వాళ్ల దయాబిక్షను అర్థించేవాడే కాబట్టి చాలా నిదానంగానే వున్నాడు. కాని ఆయన కొడుకు మాత్రం అటువంటి వాడు ఎంతమాత్రం కాదు. కొంచం ఆవేశపూరితమైన దుందుడుకు ఘటం. బావయొక్క ఈ అర్థంలేని కోపానికి అతనికి

అరికాలునించి మంట తలపైదాకా పోయింది. అతను ఉండేలు బద్దవలే లేచి చేతు లెగరేస్తూ "అవును. మేం మోసంచేసే వాళ్ళమే. మీకు తెలియకపోవటమేం? కాని తెలియంది మాకే. సంవత్సరం అయినా పెళ్లాన్ని, కట్నానికి దడిసి ఇంటికి తీసికొనిపోకుండా ఉంటారనే సంగతి తెలియంది మాకే. అవునవును. మాదే యెత్తు. ఎందుకు పైగా చదివావ్ పెద్ద ఇంగ్లీషులు" అని నొక్కినొక్కి వెక్కిరిస్తున్నట్లుగా అంటూ చతికిలబడి మళ్ళీ యథాస్థానంలో కూర్చున్నాడు. తన బావయొక్క ఉన్నత విద్యని పరాభవించటానికి, వేలెట్టి పొడవటానికి దొరికిన సదవకాశాన్ని సక్రమంగా ఉపయోగించుకోగలిగాననే సంతృప్తి అతని ముఖంలో కనపడుతూంది. కాని ఈ కుర్రవాని అఘాయిత్యపు మాటలకు జానకిరామయ్య అజానుబాహుడై లేచి నిలబడి పైపంచె మడిచి పెట్టి పైకి విసురుతూ "నోర్మూయ్ వోయ్. వేలెడున్నావో లేదో కోతిపిల్లకి మల్లే ఎగురుతావేం? అంత పౌరుషం వుంటే కట్నం అణా పైసలతో ఇవతల గిరాటు వేయి. మళ్ళీ అక్కడ వట్టిదే. ఇదిగో చెపుతున్నా విను. ఇప్పుడే కాదు. కట్నం మొత్తం వడ్డీ అసలు ఫాయిదాలతో సహా మాచేతిలో పోసిందాకా మీ చెల్లెలు మా గడప తొక్కటానికి వీల్లేదు. తెలుసా?" అని (రెండు చేతుల్ని దగ్గరచేర్చి, ఆ కుర్రవాని మూతి దగ్గరగా పైకి క్రిందకీ ఆడిస్తూ) "పొలం గిలం అమ్మి మీరు దాచుకోండి, పిల్లని నల్లపూసలైనా లేకుండా మేం మోసుకుపోయి పూజించుకుంటాం. మీ బాబుకీ మీకూ సిగ్గులేకపోతే సరి." అని అంటూనే మళ్లీ యధాస్థానంలో కూర్చున్నాడు.

ఈ ప్రళయభీకరమైన సంభాషణలను, తలుపు వెనకాల గడపలో కూర్చుని వింటూన్న వనజ ఆమె తల్లి తెల్ల ముఖాలు వేసికొని ఒకరివంక ఒకరు అర్థరహితంగా దీనంగా చూచుకుంటున్నారు. పెండ్లిలో చదివించిన వెండిలాంటి గడ్డపోయి, గడ్డికూడా సరిగా కాని పల్లపు పొలం వస్తున్నదన్న అక్కసుకొద్దీ ఆ తండ్రీ కొడుకులిద్దరూ వెడలక్రక్కే విషపు మాటల్ని పరంధామయ్య తప్పనిసరిగా భరిస్తున్నాడు. తన కొడుకు మాత్రం వాళ్ళతోపాటు సరికిసరిగా వడ్డిస్తున్నాడు. ఇది వాళ్ళని సమాధానపరచే మార్గం కాకపోగా, మరింత పిచ్చివాళ్ళనిగా తయారు చేస్తుందని పరంధామయ్యకు తెలుసు. అందుకనే రొయ్యాపిల్లల్లే కయ్యమాడుతున్న కొడుకుని వారిస్తూ అన్నాడు, "ఒరేయ్, ఊరుకో వెధవా. వాళ్ళయిష్టమువాలి. కష్టం సుఖం, మంచి చెడ్డా వాళ్లే గమనించాలిగాని మనం ఎంత గింజుకుంటే ఏం లాభంరా?" అని. కాని అతనికా ఉద్రేకంలో తండ్రిమాటల్ని గుర్తించటానికి అవకాశం దొరికింది కాదు. పైగా ఉడుకుమోతుతనం వస్తున్నది.

"మీరేం చేయించారేమిటి మహా? నా చెల్లెలికి ఒక్క పోగైనా పెట్టారా? సంపాయించినదంతా గల్లాల్లో పోసుకు దులకరించుకుంటూ కులుకుతున్నారు. మొన్నకి మొన్న (ప్రతి అక్షరాన్ని నొక్కి నొక్కి అంటున్నాడు) మంచిదని మీ పిల్లను మీరు తీసుకు వెళ్ళండంటే దానికేమైనా అవుతుందని, ఏదో వంక పెట్టి వెనక్కి నెట్టారు. ఇంకేమిటో పెద్ద న్యాయమూర్తిలా మాట్లాడుతాడు మావయ్య" అని అంటున్నాడు అదే ధ్వనితో. కాని ఒకటి, ఇంత ఆవేశంలో కూడా ఈ కుర్రవాడు తన మావను మావయ్యని గౌరవించాడు. అక్కడికది చాలా మెరుగే.- అని అంటూనే తన మాటల్లోని గొప్పతనాన్ని చూడమన్నట్లు తండ్రి వంక చూశాడు వీడి ప్రవర్తనకి అసలు లోలోన విసుక్కుంటున్న తండ్రిముఖం మరింత నలుపెక్కింది. కాని దానిని తన వియ్యంకుడెక్కడ పట్టేస్తాడోనని, దానిని లోలోపలనే అణచుకొని తన సహజ స్వభావంతోనే ప్రశాంతంగా అన్నాడు, "బావా! ఎందుకు మీకు వాడితో. వాడి మొఖం వాడికేం తెలుసు చిన్నకుంకకి ఇంతెందుకు బావా! మా స్థితి నీకు తెలుసుగదా. రైతే. పెండ్లికి తూర్పు పొలమే చదివించాము. మరేం చేస్తాము. మా ఖర్మ వచ్చింది. దానినలా తీసుకుపోయింది." అని అంటుండగానే పరంధామయ్య చెప్పదలుచుకుంది పూర్తి కానీయకుండానే అల్లుడు వికృతంగా తలకాయ నాడిస్తూ "అంతేలే. మీ కర్మ మిమ్మల్ని కొట్టింది. దానికి మేమేం

చెయ్యం" అని అన్నాడు. ఇతని మాట పూర్తి కాకముందే వియ్యంకుడు జానకిరామయ్య కార్యాన్ని పూర్తిచేసే ఉద్దేశ్యమేమీ లేనట్లుగా "అవునోయ్. అయితే ఇప్పుడు పోనీ. పెండ్లి అయిన తర్వాతనే వీడికి (కొడుకుని వేలుపెట్టి చూపిస్తూ) మూడునాలుగు వేలయింది. మేం మాత్రం ఎందాకా అని చచ్చేది" అన్నాడు పూర్వపు ప్రశయ ధ్వనితోనే. కాని పరంధామయ్య యథాపూర్వకంగానే,

"సరే. నీ కొడుక్కి నువ్వు బి. ఏ. చదివించుకుంటే నీకు తరిగిందేముంది వీళ్ళల్లో బాగా లాభిస్తూంది. నీకొక లెఖ్ఖా? మేమంటే చితికి పోయాం కాబట్టి నీవెన్నన్నా పడవలసి వచ్చింది" అని అన్నాడు.

జానకిరామయ్య మళ్ళీ లేచి నుంచుని సారాంశం తేల్చిచెప్పే ఉద్దేశ్యంతో "సరే. మేం అనావద్దు. మీరుపడావద్దు ఎందుకు మనకుగొడవ. కట్నం పూర్తిగా ఇస్తారా సరేసరి. లేదూ, నాకొడుక్కి రేపీపాటికి రెండో పెండ్లి ఎదుకు కాదో చూస్తాను. మీరిచ్చిన రెండు వేలూ కూడా మీముఖానే కొడతానులే" అని కొడుకు వంక చూసి "లేరా. పోదాం. అర్థరాత్రవుతూంది" అని కొడుకు రెక్క పట్టుకొని రుస రుస లాడుతూ తలుపు దభాలున తీసి గబగబా వీధిలోకి పోయి గృహోన్ముఖులయ్యారు.

కాని ఈ మాటలవల్ల స్తంభించి పోయింది ఒక్కరూ ఇద్దరూ కాదు. తండ్రి, కొడుకు, గడపలోనుంచి వింటూన్న తల్లీ కూతురు, అంతా ఒక్కసారి చందనపు బొమ్మలయి పోయారు. ఎవరికీ నోట మాట పెగలేదు. అందరి కండ్లలోనూ అశ్రువులు మాత్రం నిండి ఉన్నాయి. కొడుకు మాత్రం ఇంకా కోపం తోటే పోయిన వారి దిక్కు కేసి చూస్తూ చేతులు కట్టుకుని నిలబడి పోయాడు.

దానికే వనజ ఇంత రాత్రివేళ అరుగుమీద కూర్చుని కుపితురాలౌతూ, రెప్పవాల్చనికండ్లతో భారంగా చంద్రునివంక చూస్తూ ఉంది. తన మామ పోతూ పోతూ అన్న మాటలే ఖాయమైతే తన బ్రతుకేం కావాలో ఆమె లేత మనస్సుకు కొంతవరకు అర్థమవటం చేత, అందుమూలమైన భారాన్ని బలవంతంగా హృదయం లోంచి తోసిపారవేయ సాధ్యం కాకుండా ఉంది. అలా ఎంత వరకు ఒంటరిగా కూర్చుని ఉందో ఆమెకే తెలియదు.

---

కథానిక

# పిదపకాలం

## పండితారాధ్యుల పరంధామయ్య

గొట్లపల్లికి గరటయ్య కిరీటంలేని రాజు. అనేక దశాబ్దాలనుండి గరటయ్య వంశం గొట్లపల్లిపై విశేషాధికారాలను చెలాయించింది. ఈ మధ్య ఆంధ్రలోని సంచలనం గొట్లపల్లిని కూడా కాస్త వూపింది. కాని గరటయ్య చర్చిల్ మాదిరి గర్జించాడు. తన బొందిలో ప్రాణముండగా తన ఆధిక్యతను గొట్లపల్లి ప్రజలు గుర్తించక తప్పదని. గమనించవలసిన విశేష మేమిటంటే గరటయ్య గర్జించేటప్పుడు అతని చేతిలో అప్పుడే కాల్చబడిన జానెడు పొడుగు చుట్ట వున్నదట. ఇంతలో ఎలెక్షన్సు రావటం-గరటయ్య యింటికి ఫిఫ్టీవన్ మోడల్ కార్లు దినం నాగా లేకుండా రావడం-పోవడం- ఆ వూళ్లో పిల్లలకు పండుగగా వుండేది. గరటయ్య కూడా తానొక మెట్టు పైకి ఎక్కినట్టే భావించాడు. ఎప్పుడూ ముఖం చూపని ఆ ఘరానాదారు తన్ను కార్లలో ఎక్కించుకొని తిప్పటం, ఎంతో దీనంగా తన్ను వేడటం వీటితో గరటయ్య వుబ్బి తబ్బిబ్బయిపోయ్యాడు. తన గ్రామంలోని వోట్లన్నీ సాలిడ్ అని చెప్పి- అయినా సందేహంతోచి-తన ఆశ్రితుడు, విధేయుడునైన తిప్పయ్యను గ్రామ పరిస్థితిని గురించి అడుగుదామనుకొన్నాడు. కాని కార్లలో తిరిగే హడావిడిలో నాలుగు రోజులు దాకా వీలు చిక్కిందికాదు. అయిదవనాడు నిద్ర లేవటంతోటే తిప్పయ్య జ్ఞప్తికివచ్చి అతని కోసం మనిషిని పంపాడు. తిప్పయ్య నిమిషాల్లో రానే వచ్చాడు.